క్లుప్తంగా

విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ



విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, ఏలూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఏలూరు విద్యుత్ భవన్‌లో నిర్వహించారు. ఈ వేదికలో సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బీ.సత్యనారాయణ, సభ్యులు (ఆర్థిక) ఎస్.హరిబాబు, సభ్యులు (సాంకేతిక) పీ .శ్రీనివాస్, స్వతంత్ర సభ్యులు డాక్టర్ ఆర్.సురేంద్ర కుమార్ పాల్గొని విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ. శశిధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షకు 265 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం బ్రిడ్జికోర్సు ఒకేషనల్ విద్యార్థులకు జరిగిన ప్రయోగ పరీక్షల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 16 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు మొత్తం 265 మంది హాజరయ్యారు. ఈ పరీక్షకు 300 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 35 మంది గైర్హాజరయ్యారు.ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు నమోదు కాలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే. చంద్రశేఖరబాబు తెలిపారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి

ఏలూరు (టూటౌన్): వసతి గృహ సంక్షేమ అధికారులు మెనూ ప్రకారం ఆహారం అందించాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి ఎ. దివ్య ఒక ప్రకటనలో తెలిపారు. సంచాలకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ విజయవాడ వారి ఉత్తర్వులు ప్రకారం ఏలూరు జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖలో పనిచేస్తున్న వసతి గృహ సంక్షేమ అధికారులు, నాల్గవ తరగతి ఉద్యోగులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ మెనూ ప్రకారం ఆహారం అందించాలని, స్థానికంగా నివాసం ఉండాలని, నిర్ణీత సమయం పాటిస్తూ తప్పనిసరిగా ఎఫ్ ఆర్ ఎస్‌లో హాజరు వేయాల్సిందేనన్నారు. నాల్గవ తరగతి సిబ్బంది రుచికరమైన ఆహారం వండి విద్యార్థులకు అందించాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, పాటించాలన్నారు. ఈ సమావేశంలో వసతి గృహ సంక్షేమాధికారులు, నాల్గవ తరగతి సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి



అంగన్‌వాడీ సెంటరులో చిన్నారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాంచారయ్య

పెదపాడు: విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు పెదపాడు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు సూచించారు. శుక్రవారం పెదపాడు మండలంలోని గోగుంట ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో తరగతుల వారీగా అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. 1,2 తరగతులు పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. 3,4, 5 తరగతుల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేందుకు పలు సూచనలు చేసారు. మధ్యాహ్న భోజనం పథకం, గుడ్లు, స్టాక్ పరిశీలించారు. పాఠశాల సమస్యలపై ఆరా తీసారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, స్టాక్ పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని వారికి మెమోలు జారీ చేయాలని సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వసంతవాడ పంచాయతీ కార్యదర్శి పీవీ రమణ పాల్గొన్నారు.

రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

దెందులూరు: చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలందిస్తోందని తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. శుక్రవారం గాలాయగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లు, గుడ్లు, పోషక పదార్థాలు తనిఖీ చేశారు. అనంతరం చిన్నారులకు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులందరూ సక్రమంగా సేవలందించకపోయినా, రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ వెంట వీఆర్‌ఓ విష్ణు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు వేపనూనె అందిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్: రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్ల నివారించవచ్చని చొదిమెళ్ల వీఆర్వో తాడి ప్రసాద్ అన్నారు. శుక్రవారం చొదిమెళ్ళలో వ్యవసాయ అధికారులు పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన సహాయకురాలు వాసవి సౌజన్య రైతులకు ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు, ఎరువులు తదితర సేవల గూర్చి వివరించారు. అనంతరం డిప్యూటి తహసీల్దార్ చలపతి చేతులు మీదగా రైతులకు సబ్సిడీపై సేంద్రీయ ఎరువులు, వేపనూనె అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు బండి రాంబాబు, శ్రీరాములుతో పాటు వ్యవసాయశాఖ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మాల, మాదిగల ఏకైక మార్గం రాజ్యాధికార సాధనే



మాల,మాదిగ ఉపకులాల ఐక్య వీచిక పుస్తకావిష్కరణలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మాల, మాదిగల ఏకైక మార్గం రాజ్యాధికార సాధనే అని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డా.మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక నరసింహారావుపేటలోని ఏఐఏవైఎస్, ఎస్‌సీఆర్‌ఫీఎస్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాల, మాదిగ ఉప కులాల ఐక్య వీచిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ దేశంలో 22 శాతం జనాభా కలిగిన మాల, మాదిగ కులాల వారు నేటికి పాలితులుగానే ఉన్నారన్నారు. పాలకులుగా అవ్వాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. రిజర్వేషన్లపై చర్చ వద్దు–రాజ్యాధికారమే ముద్దు అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు, ఏఐఏవైఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు పల్లా యేసేబు, బి.నాగరాజు, గారపాటి నాగేశ్వరరావు, తొమ్మండ్రు బాబూరావు, భీమడోలు రామకృష్ణ, నమ్మిన నాగార్జున, వెంపా నాగరాజు, తదితరులు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా రామకోటి మహోత్సవాలు



హరికథా గానం చేస్తున్న పరాతయం నారాయణాచార్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం , భక్తిగీతాలపనలు, హరేరామ సంకీర్తనలు చేశారు. అనంతరం స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం చేసి స్వామి వారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామివారి పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం 5.30 గంటలకు నగరంలోని రాధాకృష్ణ పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు జోస్యుల రాధాకుమారి ధ్యానం – ధ్యానం వల్ల కలిగే లాభాలు అనే అంశంపై ప్రసంగించారు. రాత్రి 7 గంటలకు హరిద్వార్ దాసభారతి ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ పరాయతం నారాయణాచార్యులు భాగవతార్ సుందరకాండ అనే అంశంపై నిర్వహించిన హరికథా గానం అలరించింది. తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వ శాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

మార్చి 9న వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు



వామపక్ష పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న వివిధ పార్టీల నాయకులు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో బిజేపీ ప్రభుత్వం, గౌతమ్ అదానీ వంటి కార్పొరేట్ సంస్థల అవినీతి కుంభకోణం, మోదీపై బీబీసీ డాక్యుమెంటరీ నివేదికలపై ఏలూరులో వచ్చే నెల 9న వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలియజేసారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వామపక్ష నాయకులు మాట్లాడుతూ బిజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తూ, ప్రజలపై భారాలు వేస్తుందన్నారు. దీంతో దేశంలో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని గుర్తు చేశారు. నిరుద్యోగం, పేదరికం విలయతాండవం చేస్తున్నాయన్నారు. మోదీ ప్రభుత్వం కేవలం కొద్ది మంది కార్పొరేట్ సంస్థల కోసమే పనిచేస్తుందని విమర్శించారు. దేశంలో పలు రాష్ట్రాల్లో మతోన్మాద శక్తులును పెంచి పోషించడానికి కార్పొరేట్ సంస్థల ద్వారా లబ్ధి పొందడమే దీనిక కారణమంటూ ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి ప్రసాద్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ నాయకులు బండి వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పళ్ళెం కిషోర్, సీపీఐ మహిళా నాయకురాలు కొండా బేబీ, కాకర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛభారత్ క్లాప్ వాహన డ్రైవర్ల వేతనాలు పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాసరావు కోరారు. స్వచ్ఛభారత్ వాహనాల డ్రైవర్లను నియమించేటప్పుడు నెలకు రూ.18,500 వేతనం ఇస్తామని చెప్పి నేడు రూ.12,500 చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. స్వచ్ఛభారత్ వాహనానికి ఒక్కో దాని నిర్వహణకు రూ.55వేలు చెల్లిస్తూ మున్సిపాల్టీ నిధులను కాంట్రాక్టుకు దారాదత్తం చేయడం వెనుక జరిగిన అవినీతిని స్వతంత్ర దర్యాప్తు సంస్థచే విచారణ చేయించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో, నగర పంచాయతీల్లో వాహన డ్రైవర్లు విధులకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. వాహన డ్రైవర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి నెలా జీతాలు చెల్లించేలా కాంట్రాక్టు ఏజెన్సీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక కార్పొరేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు దొడ్డికర్ల నాగబాబు, కిలారి వెంకన్న, చోడవరపు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సా కళాశాల 70వ వార్షికోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సెయింట్ థెరిస్సా స్వయం ప్రతిపత్తి మహిళా కళాశాల 70వ వార్షికోత్సవాన్ని శుక్రవారం కళాశాలలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కల్నల్ ఏకే రాయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు గురువుల పట్ల గౌరవభావం, ఇతరులతో ఏర్పరుచుకునే మంచి సంబంధాలు వారి విజయానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల సమాజానికి సాధికార మహిళలను అందిస్తోందన్నారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ మరియట్ల పూదోట స్వాగత ఉపన్యాసం చేశారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రావూరి సూయజ్ మాట్లాడుతూ విద్యా విధానంలో లింగ సమానతలను పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సి మాట్లాడుతూ తమ కళాశాల నాక్ 4 సైకిళ్ళు పూర్తి చేసుకుని 5వ సైకిల్‌కు సిద్ధమవుతుందన్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల విభాగం స్నేహిత ద్వారా 35 మంది విద్యార్థులకు రూ. 500లు చొప్పున స్కాలర్‌షిప్‌ను అందచేశామన్నారు. అనంతరం వివిధ విభాగాల మెరిట్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందచేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం రామచంద్రరావుపేటలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశ్రం సీఈఓ డా.కె.హనుమంతరావు ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 3గంటల వరకూ పలు విభాగాల వైద్య నిపుణులు గుండె, మూత్ర పిండాలు, ఊపిరితిత్తులు, కిడ్నీ తదితర వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరానిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతుల అభ్యున్నతికి పథకాలు దోహదం



దెందులూరు సదస్సులో పాల్గొన్న ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శిక్షణ విద్యార్థులు

దెందులూరు: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దోహదం చేస్తాయని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (రాజమండ్రి) శిక్షణ విద్యార్థులు సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం , ఏరువాక కేంద్రం దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో పని అనుభవ కార్యక్రమంలో భాగంగా విశ్లేషాత్మక సదస్సు నిర్వహించారు. గ్రామ చిత్రపటాన్ని నేలపై ప్రదర్శించి రైతుల ఇబ్బందులపై చర్చించారు. సాగుకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు, సలహాలు వివరించారు. కార్యక్రమంలో ఎన్. శ్వేత, ఎస్. గిరిజ, ఎల్.లక్ష్మి, జ్యోతిక, జీ. దరణి, వై.ప్రమీల లు ఏఓ గద్దె రమేష్, సొసైటీ చైర్మన్ కొలుసుగణపతి రావు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	32
వంకాయలు (కాంతులు)	22	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	12–15
బెండకాయలు	40	కంద	44
పచ్చిమిర్చి	20	బీట్‌రూట్	32
కాకర కాయలు	30–36	కీరా దోస	30
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	64
బీరకాయలు (పందిరి)	54	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	32	పాలకూర	08
దొండకాయలు	32	చుక్కకూర	08
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	18	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	42–48	బఠాణీ	56
అనపకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	31
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	17
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	26
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	31
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

అదానీ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

ఏలూరు (టూటౌన్) : అదానీ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరిపి, అదానీ చేతిలో ఉన్న ప్రభుత్వ సంస్థలు వెనక్కి తీసుకోవాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్ళెం కిషోర్ కోరారు. సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ హిండెన్ బర్గ్ సంస్థ అదానీ అవినీతి అక్రమాల కుంభకోణం వెలుగులోకి తీసుకు వచ్చిందన్నారు. అదానీ కుంభకోణం వల్ల షేర్ మార్కెట్లో రూ.5.60 లక్షల కోట్లు ఆవిరై పోయాయని గుర్తు చేశారు. మధ్యతరగతి మదుపరులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గుజరాత్ రాష్ట్రంలో వజ్రాల వ్యాపారీగా అదానీ ఉండేవాడని, మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అదానీ పెట్టుబడుదారులను పోగు చేసి ఎన్నికల్లో మోదీకి సపోర్టుగా నిలిచారన్నారు. దానికి ప్రతిగా ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టడంతో అదానీ నేడు ప్రపంచ కుబేరుల జాబితాలో రెండవ స్థానంలోకి ఎగబాకారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పీవీ రామకృష్ణ, నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, వీ.వీ.వీ.ఎస్ ప్రసాద్, జె.గోపి, మావూరి శ్రీనివాసరావు, జి.యేసుబాబు, ఎస్.సత్యనారాయణ, చల్లా పైదియ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలి



గ్రామ సచివాలయాన్ని సందర్శించిన స్త్రీ శిశు సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు డా. సిరి

పెదపాడు: పిల్లల్లో పోషణ లోపాన్ని గుర్తించి వారిని ఆరోగ్యవంతులుగా మార్చేందుకు గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి, ఏఎన్ఎంలు తగు చర్యలు తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టరు ఏ సిరి తెలిపారు. శుక్రవారం పెదపాడు మండలంలోని అప్పనవీడులోని గ్రామ సచివాలయాన్ని ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె సచివాలయ రికార్డులు పరిశీలించి వారికి సూచలను సలహాలు అందించారు. సచివాలయంలో లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత లేకుండా గర్భిణులకు తగు సూచనలు సలహాలు, పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రాజెక్టు డైరక్టరు కేవీఎల్ పద్మావతి, అదనపు సీడీపీవో యంఎస్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

దెందులూరు: సోమవరప్పాడులో నూతనంగా నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. ఆయన వెంట మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ సరిగే నాగరాజు, గ్రామ పెద్దలు తదితరులున్నారు.

నేడు గృహసారథుల సమావేశం

పెదవేగి : నేడు ఏడు గ్రామాలకు సంబంధించిన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించనున్నట్లు పెదవేగి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కేశన సతీష్ చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పెదవేగి సొసైటీ పరిధిలోని శనివారం పెదవేగి, గార్లమడుగు, లక్ష్మీపురం, కొప్పులవారిగూడెం, న్యాయంపల్లి, కూచింపూడి, రామశింగవరం సచివాలయాలకు సంబంధించిన కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని, కావున ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సతీష్ కోరారు.

ఈనాడు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



గాలాయగూడెంలో ఈనాడు పత్రులను దహనం చేస్తున్న గ్రామస్తులు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కించపరిచేలా అవాస్తవాలను ప్రచురించిన ఈనాడు యాజమాన్యంపై తగి న చర్యలు తీసుకోవాలని గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు డిమాండ్ చేశారు. సంవత్సరాల కిందటి ఫొటోలను ఇప్పుడు జరిగినట్లు దురుద్దేశ్యపూరితంగా వార్తలను ప్రచురించినంత మాత్రాన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తి ప్రతిష్టలు తగ్గవన్నారు. ఈనాడు రాతలకు నిరసనగా పేపర్లను రోడ్డుపై దహనం చేశారు.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

భీమడోలు: తన భార్య కనిపించడం లేదని భర్త భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసాడు. భీమడోలు పంచాయతీ శివారు అర్జావారిగూడెంకు చెందిన వివాహిత ఈనెల 14 నుంచి కనిపించడం లేదని భర్త పెద్దిరాజు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

దెందులూరు: దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసలు, మినుములు కొనుగోలు కేంద్రం శనివారం ప్రారంభించనున్నట్టు దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు తెలిపారు. దళారుల మాటలు నమ్మి మినుములు, పెసలు రైతులు తక్కువ ధరకు పంట ఉత్పత్తులను అమ్ముకోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న దెందులూరు కోఆపరేటివ్ సొసైటీలో ఏపీ మార్క్‌ఫెడ్ కొను గోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు తెలియజేస్తున్నారన్నారు.